క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



విద్యార్థి షేక్ సుమయ్యని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సునిత

కడప ఎడ్యుకేషన్ : కడప కాగితాలపెంట జెడ్పీ ఉర్దూ హైస్కూల్ 8వ తరగతికి చెందిన షేక్ సుమయ్య అనే విద్యార్థి టేక్వాండో చాంపియన్ షిప్–2023 పోటీలో గోల్డ్ మెడల్‌ను సాధించినట్లు హెడ్‌మాస్టర్ సునితా తెలిపారు. ఈనెల 11, 12 తేదీలలో తిరుపతిలో జరిగిన ఫస్ట్ ఓపెన్ సౌత్ జోన్ టేక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటి బంగారు పతకాన్ని సాధించారు. షేక్ సుమయ్యను ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో..



విద్యార్థి అఫ్జల్‌బాషాను అభినందిస్తున్న కార్పొరేటర్ సూర్యనారాయణరావు

తిరుపతి విశ్వం విద్యాసంస్థల్లో ఫిబ్రవరి 11, 12 తేదీలలో నిర్వహించిన టెంపుల్ ఆఫ్ తైక్వాండో భారత్ ఫస్ట్ ఓపెన్ చాంపియన్ షిప్–2023 పోటీల్లో కడప నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి అఫ్జల్‌బాష రెండు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు ఇన్‌చార్జు హెచ్‌ఎం కలీముల్లా తెలిపారు. బుధవారం విద్యార్థి అఫ్జల్ బాషను 25వ డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణరావు, ఉపాధ్యాయులు అభినందించారు. మాస్టర్ జంషీర్, పాఠశాల ఇన్‌చార్జు హెచ్‌ఎం కలిముల్లా, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మెన్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు ఆహ్వానం



కడప కల్చరల్ : జిల్లాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత, రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర ఉపన్యాసకులు ఐఎల్ఎన్ చంద్రశేఖర్‌రావును శ్రీశైలం క్షేత్రంలో శివరాత్రి సందర్భంగా ప్రవచనం చెప్పేందుకు ఆహ్వానించారు. శ్రీశైలం క్షేత్రంలోని శ్రీ భ్రమరాంభ మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం సరస్వి పుష్కరిణి వేదిక వద్ద ఆయనను 'శివలీలలు' అంశంపై ప్రవచనం చెప్పాలని దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నుంచి ఆహ్వానం అందింది. రాష్ట్రంలోని దాదాపు అన్నీ ఆధ్యాత్మిక క్షేత్రాల గురించి భక్తులకు అందజేసిన పుస్తకాల రచయితగా, టీవీ, రేడియో వ్యాఖ్యతగా ఐఎల్ఎన్ చంద్రశేఖర్‌రావు తెలుగు పాఠకులకు సుపరిచితులు.

డైరీ ఆవిష్కరణ



ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : షెడ్యుల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2023 డైరీని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా ఆవిష్కరించారు. బుధవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ దళితుల హక్కుల పరిరక్షణ కోసం సంఘం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి జ్ఞాన ప్రకాష్ జై భీమ్ మాల మహాసేన అధ్యక్షుడు పి. సపంత్ కుమార్, శ్యాంసన్, చైతల్య తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ఘనంగా ఏర్పాట్లు



శివరాత్రికి ముస్తాబైన శ్రీ లలిత పంచాయతన ఆలయం



విద్యుద్దీపాల వెలుగుల్లో విజయదుర్గాలయం

కడప కల్చరల్ : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు శివాలయాల్లో భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, దాతలు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా పండుగ సందర్భంగా కొన్నిచోట్ల రెండురోజులు, మరికొన్నిచోట్ల మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

కడప నగరం శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు గణపతి పూజతో శివరాత్రి పూజలు ప్రారంభం కానున్నాయి. శనివారం శివరాత్రి రోజు ఉదయం 5.30 గంటల నుంచి సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. 19న ఆదివారం మధ్యాహ్నం విశేష పూజలతోపాటు భక్తులకు అన్నదానం చేయనున్నారు. దేవునికడప శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం 4 నుంచి 9 గంటల వరకు విశేష అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన, 11.00 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, సాయంత్రం 5.30 గంటలకు రథోత్సవం నిర్వహిస్తారు. 19న ఉదయం విశేష పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు. డాక్టర్ వైఎస్సార్ కాలనీ వద్దగల ఉక్కాయపల్లె కొండపై శ్రీ ఉరకొండ మల్లికార్జున స్వామి ఆలయంలో ఉదయం 4.00 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. శ్రీ లలితా పంచాయతన ఆలయంలో శనివారం ఉదయం 6.00 గంటలకు మహాన్యాసం, 7.30 గంటలకు రుద్రాభిషేకం, 10.30 గంటలకు దివ్య దర్శనం, రాత్రి 8 గంటలకు శివపార్వతుల కల్యాణం, తెల్లవారుజామున 4.00 గంటలకు శివపార్వతుల ఊరేగింపు నిర్వహిస్తారు.

రాజారెడ్డివీధిలో శ్రీ భవానిసమేత మహా కాళేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 18వ తేది ఉదయం 5.00 గంటలకు రుద్రాభిషేకం, 10.00 గంటలకు కల్యాణం నిర్వహిస్తారు. నబీకోటలోని శ్రీ మల్లికార్జునస్వామి, సర్వమంగళాదేవి ఆలయంలో శనివారం ఉదయం 7.00 నుంచి 9.00 గంటల వరకు మూలమూర్తికి నువ్వులతో అభిషేకం, మధ్యాహ్నం 12.00 గంటలకు అన్నదానం నిర్వహిస్తారు. రాత్రి 12.00 గంటలకు లింగోద్భవ పూజ నిర్వహించనున్నారు. స్థానిక ప్రకాశ్‌నగర్‌లోని శ్రీ అమరేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం 4.00 గంటల నుంచి అభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి కల్యాణోత్సవం, రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ఆదివారం మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 3 గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. హౌసింగ్ బోర్డు కోదండ రామాలయంలో ఉదయం 4 గంటల నుంచి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. రాత్రి కల్యాణోత్సవం, అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

యువశక్తితో అద్భుత ఫలితాలు

వ్యక్తిత్వ వికాస ప్రేరణసభలో స్వామి సన్నివాసానంద



మాట్లాడుతున్న సన్నివాసానంద

వైవీయూ : యువత క్రమశిక్షణతో శక్తియుక్తులను వినియోగించగలిగితే ప్రపంచం మెచ్చే గొప్ప వ్యక్తులుగా తయారవుతారని రామకృష్ణ మఠం స్వామీజీ సన్నివాసానంద, చిన్మయమిషన్ స్వామీజీ తురియానంద మహారాజ్ ఉద్బోధించారు. బుధవారం వైవీయూలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 'స్వామి వివేకానంద రచనలు – వ్యక్తిత్వ వికాసం' అన్న అంశంపై ప్రత్యేక ఉపన్యాస, ప్రేరణసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి సన్నివాసానంద మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను, ఆదర్శాలను ప్రపంచానికి చాటిన వివేకానందుడ్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువతశక్తిని సరైన మార్గంలో వినియోగిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని తెలిపారు. చిన్మయ మిషన్ స్వామీజీ తురియానంద మహారాజ్ మాట్లాడుతూ ఉన్న స్థితి నుంచి ఉన్నతస్థితికి చేరుకోవడానికి తీసుకునే నిర్ణయాలు కఠినంగా అమలు చేయడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డా.కె.రామ సుబ్బారెడ్డి, వైవీయూ అలుమ్నీ అధ్యక్షుడు డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు మాట్లాడారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అలుమ్నీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, శివశంకర్, సురేష్‌యాదవ్, శశికుమార్, మానస, రాఘవరెడ్డి, మోజెస్, హరి, లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

21న సీకే దిన్నె గంగజాతర మహోత్సవం



గంగజాతర మహోత్సవ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె/వైవీయూ : చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గ్రామంలో వెలసిన గంగమ్మదేవత జాతర మహోత్సవం ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలో కమలాపురం శాసనసభ్యుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన స్వగృహంలో జాతర మహోత్సవానికి సంబంధించిన పోస్టర్లు, ఆహ్వానపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తుల పాలిటి కొంగు బంగారమై, కోరిన వరాలనొసగే గంగమ్మ జాతర వార్షిక జాతరను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఆలయ కమిటీ చైర్మన్ పి.బి. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ 21వ తేదీ మంగళవారం రాత్రి 12 గంటలకు అమ్మవారి కళ్యాణము, నిండుతిరుణాల, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22న మైల తిరుణాల నిర్వహిస్తామని తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఈఓ సురేష్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో జిల్లాకు పతకాల పంట

- ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో 35 పతకాలు కైవసం
- 22 మంది క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రత్యేకాధికారి బాషామోహిద్దీన్, కోచ్ తమీమ్ అన్సారీ

కడప స్పోర్ట్స్ : ఇటీవల కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ జిమ్నాస్టిక్స్ పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో మొత్తం 35 పతకాలు సాధించి సత్తాచాటారు. రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన 22 మంది క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం విశేషం. వీరిలో 19 మంది క్రీడాకారులు వైఎస్ఆర్ క్రీడాపాఠశాల నుంచి ప్రాతినిత్యం వహించడం విశేషం. ఈ పోటీల్లో 21 స్వర్ణపతకాలు, 6 రజత పతకాలు, 8 కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఉత్తమ శిక్షణ అందించిన జిమ్నాస్టిక్స్ శిక్షకుడు తమీమ్ అన్సారీని అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు.. సి. శేషాద్రి, వై.గంగునాయుడు, వై. శశాంక్, వి.బస్వరాజు, పి. రాఘవ, వై.వి.ప్రణీత్, కె. వరుణ్‌తేజ, కె. తేజ, ఎస్.జె. నిఖిల్, ఎస్. సరస్వతి, ఆర్. నాగవేణి, ఎస్.శివనందిని, పి.హిమవర్షిణి, వై.గంగా భవాని, ఎస్. ధరణి, వై. స్వాతి, కె. ఈశ్వరి, కె. రజిత, సి.హెచ్.జోహిత శ్రావ్య, వై.కిరణ్మయి, సుధ, సుహైల్.

భూ ఆక్రమణకు అడ్డుకట్ట వేయాలి

కడప రూరల్ : దాయాదులే దౌర్జన్యంగా భూ ఆక్రమణకు పాల్పడుతున్నారు.. తనకు న్యాయం చేయాలని కడప నగరం చలమారెడ్డిపల్లెకు చెందిన తెల్లపాటి ధనుంజయ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప నగరం ఉక్కాయపల్లెలో తమకు 67 సెంట్ల వ్యవసాయ పొలం ఉందన్నారు. ఈ పొలంలో పంటలు పండించుకుని జీవించేవారమన్నారు. అయితే తమ దాయాదులు దౌర్జన్యంగా భూ ఆక్రమణకు ప్రయత్నించగా 2007లో న్యాయం కోసం న్యాయస్థానానికి వెళ్లామన్నారు.2013లో కోర్టు తనకు అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. అప్పటి నుంచి మళ్లీ పంటలు పండించుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల తన దాయాదులు దౌర్జన్యంగా తన స్థలంలో అక్రమంగా నిర్మాణాలు సాగిస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయమై స్థానిక చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో రెండు రోజుల కిందట ఫిర్యాదు చేశామని తెలిపారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

నేడు శ్రీ నాగుల వార్షికోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం ఫైర్‌స్టేషన్ ప్రాంగణంలోగల నాగులకట్ట 27వ వార్షికోత్సవం గురువారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు అభిషేకం, గణపతిపూజ, నవగ్రహ పూజ, సర్వశాంతి హోమం నిర్వహిస్తారు. 11.30 గంటలకు శ్రీ అశ్వర్థ నారాయణస్వామి కల్యాణోత్సవం, పూర్ణాహుతి, అనంతరం అన్నదానం నిర్వహిస్తారు.

పుస్తక పఠనం అలవాటు చేయాలి

దంత వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ నజిముద్దీన్



మాట్లాడుతున్న డాక్టర్ నజిముద్దీన్

కడప ఎడ్యుకేషన్ : ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు పుస్తక పఠనాన్ని అలవాటు చేయాలని దంత వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ నజిముద్దీన్ ఉపాధ్యాయులకు సూచించారు. కడప నగరంలోని మోచంపేట ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో సోషల్ జస్టిస్ ఫోర్ ఇంటర్నేషనల్ సివిల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నగర అధ్యక్షులు, లయన్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో పుస్తక పఠనంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నజిముద్దీన్ మాట్లాడుతూ ప్రస్తుతం యువత సెల్‌ఫోన్‌లలో మునిగి తేలుతున్నారన్నారు. సోషల్ మీడియాకు బానిసలవడం విచారకరమన్నారు. విద్యార్థులు లైబ్రరీలకు వెళ్లే అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం పిల్లలకు కొన్ని కథల పుస్తకాలను పంపిణీ చేశారు. సోషల్ జస్టిస్ ఫర్ నేషనల్ సివిల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శేషు, బాదుల్లా, ప్రధానోపాధ్యాయుడు జాబీర్ అహ్మద్‌రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ట

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో పూర్వపు ధ్వజస్తంభం స్థానంలో నూతన ధ్వజ స్తంభాన్ని గురువారం మఠం నిర్వాకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. మఠం ప్రత్యేక పూజారులు ఆచార్య ఇడమకంటి జనార్ధనశివాచార్య, పడకండ్ల వెంకటాచార్యులు, పోలేపల్లె రామబ్రహ్మం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దాతల సహకారంతో ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మఠం మేనేజర్ ఈశ్వరాచారి కోరారు.

కేఎస్ఆర్ఎంలో ఐసీఐ స్టూడెంట్ లోకల్ చాప్టర్ ఆవిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెలగల జగదీష్

కడప ఎడ్యుకేషన్ : భారతదేశంలో ప్రముఖ ఇండియన్ కాంక్రీట్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా 8వ శాఖను కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య విశిష్ట అతిథిగా విజయవాడ భారత కాంక్రీట్ సంస్థ అధ్యక్షులు, భారత వెదరు పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ వెలగల జగదీష్, జలవనరుల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఛీఫ్ గిరిధర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు వృత్తిపరమైన అవసరాలు, టెక్నాలజీ, నిర్మాణ రంగాలలో ప్రోత్సహించడానికి, పరిశోధనకు అంకితం చేయబడిన సంస్థ ఐసీఐ అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ఐసీఐ స్టూడెంట్ లోకల్ చాప్టర్‌లో సభ్యత్వం నమోదు చేసుకున్నారు. కళాశాల ఎండీ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రధానాచార్యులు వీఎస్ఎస్‌మూర్తి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి అమర్‌నాథ్‌రెడ్డి, ఆచార్యులు శ్రీనివాసులరెడ్డి, ప్రొఫెసర్ కిరణ్‌కుమార్, గిరిధర్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ యంవి రవికిషోర్‌రెడ్డి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ ప్రయోజనమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం కావాలి

వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ : జాతీయ సేవాపథకంలోని ప్రతి ఒక్కరూ సమైక్యంగా పనిచేయడం ద్వారా సమాజ ప్రయోజనాలను నెరవేర్చవచ్చని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం వైవీయూలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్‌కు చెన్నైకి చెందిన రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మూడురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సామాజిక సేవలో యువతను భాగస్వాములను చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో నీటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటి నుంచి బయటపడేందుకు పర్యావరణ పరిరక్షణ, జలసంరక్షణ వంటి చర్యలు చేపట్టాలన్నారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా. వెంకటరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ మాజీ ప్రోగ్రాం ఆఫీసర్ ఎ. మధుసూదన్ రెడ్డి, ఢిల్లీకి చెందిన ఇషానిసేన్ తదితరులు మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చరిత్రాత్మకం

కడప కార్పొరేషన్ : రాయలసీమ వాసుల చిరకాల వాంఛ అయిన ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భూమిపూజ చేయడం చారిత్రాత్మకమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక మారుతీనగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని విభజన చట్టంలో స్పష్టంగా పొందుపరిచారన్నారు. ఆ చట్టాన్ని అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విభజన జరిగి ఏళ్లు గడుస్తున్నా కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించి ప్రభుత్వ రంగంలో పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోలేదన్నారు. విభజన తర్వాత ఐదేళ్లు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ఉక్కు పరిశ్రమ గూర్చి పట్టించుకోలేదన్నారు. ఈ పరిణామాల మధ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకమైన జేఎస్‌డబ్ల్యూ కంపెనీ జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేలా మార్గం సుగమం చేయడం అభినందనీయమన్నారు. వెనుకబడిన రాయలసీమలో నిరుద్యోగాన్ని పారదోలేందుకు, జీవనోపాధి కల్పించేందుకు ఈ పరిశ్రమ ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వెన్నపూస రవీంద్రారెడ్డి ముమ్మర ప్రచారం



చైతన్య స్కూల్ ఏజీఎం, ప్రిన్సిపల్, సిబ్బందితో ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి కడపలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. బుధవారం రాజీవ్ పార్కు సమీపంలోని చైతన్య స్కూల్‌లో ఏజీఎం రమణ, ప్రిన్సిపాల్, సిబ్బందిని కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. ఆ తర్వాత విద్యుత్ భవన్‌లో ఉద్యోగులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను బలపరచాలని కోరారు. పట్టభద్రులంతా తమ మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి, వేయించి గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్. వెంకట్రామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమణ, ప్రసాద్, చంద్రశేఖర్, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

'దిశ' చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలి

కడప స్పోర్ట్స్ : దిశ చట్టం, యాప్‌పై బాలికలు, మహిళలు అవగాహన పెంపొందించుకోవాలని స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు సూచించారు. బుధవారం చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో 'దిశ చట్టం–మహిళలు – బాలికల అక్రమ రవాణా' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ క్రిమినల్ లా చట్టం 2019, ఏపీ స్పెషల్ కోర్ట్ ఫర్ స్పెసిఫైడ్ అఫెన్సెస్ ఎగైనెస్ట్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ యాక్ట్ 2019 ల గురించి వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. శోభారాణి, దిశ వన్‌స్టాప్ సెంటర్ ఎన్. అశ్విని, దిశ పోలీస్ స్టేషన్ నుంచి అహ్మద్‌అలీ, టిప్పుసుల్తాన్, పుష్పలత, పావని తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

చెన్నూరు : కొండపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దివంగత పెడబల్లి సుబ్బారెడ్డి, పెడబల్లె శివారెడ్డిల సంస్మరణార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి వారిచే కొండపేట బంగ్లాలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అధునాతన టెక్నాలజీతో ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా చేస్తారని పుష్పగిరి కంటి ఆస్పత్రి క్యాంపు కో ఆర్డినేటర్ అమర్నాథరెడ్డి తెలిపారు. ఆపరేషన్లు చేయించుకునే వారు ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీకార్డు తప్పక తీసుకురావాలని, వారికి పుష్పగిరి కంటి ఆస్పత్రి వారు ఉచిత వాహన, భోజన సౌకర్యంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. కంటి వైద్య శిబిరానికి వచ్చిన వారికి భోజన వసతి ఏర్పాటు చేశారు.

పంట నమోదు త్వరితగతిన పూర్తి చేయాలి

పెండ్లిమర్రి : రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు పంట నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్బారావు అన్నారు. పెండ్లిమర్రి రైతు భరోసా కేంద్రంలో బుధవారం వ్యవసాయశాఖ సిబ్బందికి సమావేశం నిర్వహించి మాట్లాడారు. పంట నమోదుతో పాటు ఈకేవైసీ కూడా పూర్తి చేయాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించిన డబ్బులు పడని రైతులు మార్చి 31వ తేదీ నాటికి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ బ్లెస్సీ, ఏఈఓ గంగాప్రసాద్, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణానికి పచ్చదనం అవసరం



మొక్క నాటుతున్న ఫాతిమా వైద్య కళాశాల గౌరవ కార్యదర్శి ఏక్యూ జవ్వాద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : నేటి సమాజంలో పర్యావరణానికి పచ్చదనం అవసరాన్ని గుర్తించాలని ఫాతిమా వైద్య కళాశాల గౌరవ కార్యదర్శి ఏక్యూ జవ్వాద్ తెలిపారు. బుధవారం ఫాతిమా వైద్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కల పెంపకంలో భాగంగా 400కు పైగా మొక్కలను ఏక్యూ జవ్వాద్ ఆధ్వర్యంలో నాటారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ మర్జాజా, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్ మనోహర్‌రెడ్డి, జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.